సాక్షి
కుమురం భీం
గురువారం ∣ 17 ∣ ఆగస్టు ∣ 2023

అక్రమ అరెస్టులు సరికాదు

ఆసిఫాబాద్‌రూరల్‌: సర్వశిక్ష అభియాన్‌ కాంట్రాక్టు ఉద్యోగులను హైదరాబాద్‌లో అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని యూటీఎఫ్‌ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి పేర్కొన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న వారిపై చర్యలు సరికాదన్నారు.

శ్రావణం.. శుభప్రదం



హిందూ సంప్రదాయం ప్రకారం శ్రావణమాసం అత్యంత పవిత్రమైంది. గురువారం నుంచి నిజ శ్రావణ మాసం ప్రారంభం కాగా, సెప్టెంబర్‌ 15 శుక్రవారంతో ముగియనుంది.

8లో▸

గరిష్టం/కనిష్టం
32.5/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

‘అంబేద్కర్‌ విదేశీ విద్యానిధి’కి దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్‌: విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు అంబేద్కర్‌ విదేశీ విద్యానిధి పథకం కింద 2023– 24 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్‌ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్‌ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్హులు సెప్టెంబర్‌ 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం https://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన కోరారు.

జెడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలోని ఒడ్డపల్లి గార్డెన్స్‌లో గురువారం నిర్వహించాల్సిన జెడ్పీ సర్వసభ్య సమావేశం అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు సీఈవో రత్నమాల ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం తిరిగి నిర్వహించే తేదీని త్వరలోనే వెల్లడిస్తామని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

396కు చేరిన ‘మద్యం’ దరఖాస్తులు

ఆసిఫాబాద్‌: జిల్లాలోని మద్యం దుకాణాల నిర్వహణకు ఒకేరోజు 112 దరఖాస్తులు వచ్చాయి. బుధవారం ఆసిఫాబాద్‌ డివిజన్‌లో 48, కాగజ్‌నగర్‌ డివిజన్‌లో 64 దరఖాస్తులు రావడంతో మొత్తం దరఖాస్తుల సంఖ్య 396కు చేరినట్లు జిల్లా ఎక్సైజ్‌ అధికారి జ్యోతికిరణ్‌ తెలిపారు.

5కే రన్‌ విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్‌: ఎన్నికల సంఘం ఆదేశాలతో ‘ఐ ఓట్‌ ఫర్‌ ష్యూర్‌’ అనే నినాదంలో జిల్లాలో ఈ నెల 19న నిర్వహించే 5కే రన్‌ను విజయవంతం చేయాలని కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని రెండు నియోజకవర్గ పరిధిలో నిర్వహించే ఈ 5కే రన్‌ కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు.

రోడ్డుపై బైఠాయించిన భగీరథ కార్మికులు



ఆందోళన చేస్తున్న కార్మికులు, నాయకులు

కెరమెరి(ఆసిఫాబాద్‌): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ కెరమెరి మండలంలోని ధనోరా పంప్‌ హౌస్‌ ఎదుట బుధవారం మిషన్‌ భగీరథ కార్మికులు బైఠాయించి నిరసన తెలిపారు. కార్మికులకు సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేశ్‌ మాట్లాడుతూ కార్మికులు ఆందోళనలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. 5 నెలల పెండింగ్‌ వేతనాలు చెల్లించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో నాయకులు దుర్గం లింగయ్య, శ్రీకాంత్‌, విఠల్‌, భీమరాజ్‌, బుడ్డయ్య, అంకుస్‌, శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

19న సమన్వయ కమిటీ సమావేశం

ఆసిఫాబాద్‌అర్బన్‌: లోక్‌అదాలత్‌ నిర్వహణపై జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో ఈ నెల 19న సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా జడ్జి ఎంవీ రమేశ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు బార్‌ అసోసియేషన్‌ సభ్యులు, సాయంత్రం 4 గంటలకు పోలీసులు, అధికారులతో సమావేశం కానున్నట్లు పేర్కొన్నారు. కాగా సెప్టెంబర్‌ 9న లోక్‌అదాలత్‌ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



దహెగాంలో నూతన అంబులెన్సు ప్రారంభిస్తున్న వైద్యులు, సిబ్బంది (ఫైల్‌)

అమ్మకు ఆసరాగా..!

- జిల్లాకు కొత్తగా 10 అమ్మఒడి వాహనాలు..
- మరో మూడు 108 అంబులెన్స్‌లు కేటాయింపు
- పాత వాటి స్థానంలో సమకూర్చిన రాష్ట్ర ప్రభుత్వం
- ఇటీవలే ప్రారంభించిన వైద్యారోగ్య శాఖ అధికారులు
- అత్యవసర సమయంలో ఉపయోగకరం

ఈ ఏడాది బాధితుల తరలింపు వివరాలు

నెల	108 అంబులెన్స్‌	102 (అమ్మఒడి)
జనవరి	857	3,133
ఫిబ్రవరి	737	2,917
మార్చి	918	3,256
ఏప్రిల్‌	799	3,142
మే	811	3,485
జూన్‌	771	4,910
జూలై	824	2,349

పెంచికల్‌పేట్‌(ఆసిఫాబాద్‌): అత్యవసర సమయంలో గర్భిణులు, బాలింతలకు ఆసరాగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు కొత్త 102(అమ్మఒడి) వాహనాలను కేటాయించింది. దీంతోపాటు రోగులను తరలించేందుకు వీలుగా పాత వాహనాల స్థానంలో 108 అంబులెన్సులను సైతం అందించింది. దీంతో మారుమూల గ్రామాల ప్రజలు ఆస్పత్రులకు వేగంగా చేరుకునేందుకు అవకాశం కలిగింది.

వర్షాకాలంలో అష్టకష్టాలు..

జిల్లాలోని అనేక గ్రామాలకు నేటికీ సరైన రోడ్డు సదుపాయం లేదు. ఆర్టీసీ సౌకర్యం లేని పల్లెలు అనేకం. రాకపోకలకు ప్రైవేట్‌ వాహనాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి. వర్షాకాలంలో జిల్లావాసుల బాధలు వర్ణనాతీతం. ముఖ్యంగా అత్యవసర సమయంలో రోగులు, గర్భిణులు, బాలింతలను మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు తరలించాలంటే అష్టకష్టాలు పడాల్సిందే. అంబులెన్స్‌లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో చాలాచోట్ల మూలకు చేరాయి. కొన్ని ప్రాంతాల ప్రజలు పక్క మండలాల వాహనంపైనే ఆధారపడాల్సిన దుస్థితి. గర్భిణులను ఎడ్లబండ్లపై తరలించిన పరిస్థితులూ ఉన్నాయి. ఇలాంటి సమయంలో ప్రభుత్వం అందించిన వాహనాలు ఎంతో ఉపయోగకరంగా మారనున్నాయి. జిల్లాలో మొత్తం పన్నెండు 108 వాహనాలు ఉండగా, 15 అమ్మఒడి వాహనాలు ఉన్నాయి. తరచూ మరమ్మతులు గురవుతున్న వాటి స్థానంలో కొత్తవి మంజూరు చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 108 వాహనాల్లో 5,717 మందిని తరలించగా, అమ్మ ఒడి వాహనాలల్లో 23,192 మందిని తరలించారు.

వాహనాల కేటాయింపు ఇలా..

జిల్లాలోని సిర్పూర్‌(యూ), వాంకిడి, దహెగాం మండలాలకు అత్యవసర సేవలు అందించేందుకు మూడు 108 అంబులెన్సులను కేటాయించారు. అలాగే పెంచికల్‌పేట్‌, బెజ్జూర్‌, కాగజ్‌నగర్‌, సిర్పూర్‌(టి), కెరమెరి, తిర్యాణి, రెబ్బెన, ఆసిఫాబాద్‌, వాంకిడి, జైనూర్‌ మండలాలకు 102(అమ్మ ఒడి) వాహనాలను అందించారు. దీంతో ఆయా మండల కేంద్రాల నుంచి పట్టణ ప్రాంతాలకు మెరుగైన వైద్యసేవల కోసం వెళ్లేందుకు ప్రజల ఇబ్బందులు తొలగిపోనున్నాయి. గతంలో గర్భిణులు, బాలింతలను తరలించేందుకు కాలం చెల్లిన వాహనాలు వినియోగించేవారు. అవి మార్గమధ్యలో మొరాయిస్తే వైద్యసిబ్బందితోపాటు బాధితులు అవస్థలు పడేవారు. కొత్త వాహనాలను వైద్యారోగ్యశాఖ సిబ్బంది అనుకూలంగా ఉండే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి మరిన్ని సదుపాయాలతో రూపొందించారు. ప్రతీ అంబులెన్సు రాకపోకలను మానిటరింగ్‌ చేసేందుకు వీలుగా ప్రత్యేక జీపీఎస్‌ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీని ద్వారా వాహనం ఎక్కడ ఉంది.. ఏ సమయంలో ఆస్పత్రికి చేరుకుంటుంది.. అనే వివరాలు తెలుసుకునేందుకు అవకాశం కలగనుంది. నూతన వాహనాల కేటాయింపుపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మరింత చేరువగా వైద్యం

రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర సమయంలో రోగులు, గర్భిణులు, బాలింతలను ఆస్పత్రులకు తరలించేందుకు పాత వాహనాల స్థానంలో కొత్త వాహనాలను సమకూర్చింది. జిల్లాలోని మారుమూల గ్రామాల్లో 108, 102 వాహనాలు విలువైన వైద్యసేవలు అందిస్తున్నాయి. కొత్త వాహనాలు అందుబాటులోకి రావడంతో ప్రజలకు వైద్యం మరింత చేరువ కానుంది.

– సీతారాం, డిప్యూటీ డీఎంహెచ్‌వో

వేగంగా వ్యవసాయ గణన

- ఇప్పటికే 31 శాతం పూర్తి
- ఈ నెలాఖరులోగా పూర్తయ్యే అవకాశం
- రెవెన్యూ గ్రామం యూనిట్‌గా వివరాలు సేకరణ
- ఈసారి భూకమతాల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి
- 105 మందికి బాధ్యతలు అప్పగింత



ఆసిఫాబాద్‌ మండలం చిర్రకుంటలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

2015– 16 గణన వివరాలు

రైతులు	సంఖ్య
సన్నకారు	44,590
చిన్నకారు	35,626
పాక్షికం	27,677
పెద్ద	315
మొత్తం	1,08,208

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లాలో 11వ వ్యవసాయ గణన శరవేగంగా కొనసాగుతోంది. రైతులు, భూకమతాల వివరాలను పకడ్బందీగా నమోదు చేసేందుకు వ్యవసాయశాఖ అధికారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలను ఎప్పటికప్పుడు మొబైల్‌ యాప్‌లో నమోదు చేస్తున్నారు. రాష్ట్రంలో చివరిసారిగా 2015– 16లో 10వ వ్యవసాయ గణన నిర్వహించారు. ఐదేళ్లకు ఒకసారి వివరాలు సేకరించాల్సి ఉన్నా వివిధ కారణాలతో వాయిదా పడింది. 11వ గణనలో వ్యవసాయ కమతాలను గుర్తించాలని నిర్ణయించడంతో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏవో, ఏఈవోలు, ప్రణాళిక గణాంక శాఖ మండల అధికారులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. మూడు దశల్లో వివరాలు సేకరించనున్నారు. ఈ నెల చివరి నాటికి గణనను పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో మొత్తం 2,26,850 మంది రైతులు ఉండగా, ఇప్పటివరకు 69,388 మంది రైతుల వివరాలు సేకరించారు.

మూడు దశల్లో గణన..

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవసాయ, గణాంకశాల ఆధ్వర్యంలో రైతులు, భూకమతలతోపాటు పది అంశాలను సేకరిస్తున్నారు. మొదటి దశలో కమతాలకు అనుగుణంగా సన్నకారు, చిన్నకారు, పాక్షిక, పెద్ద రైతులు, వారి వయస్సు, విద్యార్హతలు, కులం, కుటుంబ సభ్యులు, ఇతర వివరాలు నమోదు చేసుకుంటున్నారు. రెండో దశలో పంటల వివరాలు, నీటి సదుపాయానికి సంబంధించిన సమాచారం, మూడో దశలో ఎరువులు, పురుగు మందుల వాడకం, పశు సంపద తదితర సమాచారం నమోదు చేసుకుంటారు. ఇందుకోసం ప్రతీ రెవెన్యూ గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకోనున్నారు.

105 మందికి బాధ్యతలు..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 పంచాయతీలు ఉన్నాయి. వ్యవసాయ గణనకు కలెక్టర్‌ చైర్మన్‌గా వ్యవహరిస్తుండగా కన్వీనర్‌గా జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి, వ్యవసాయ, పశుసంవర్ధక, హార్టికల్చర్‌, నీటిపారుదల జిల్లా అధికారులు సభ్యులుగా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 434 రెవెన్యూ గ్రామాలు ఉండగా, ఒక్కో రెవెన్యూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని అధికారులు వ్యవసాయ గణన చేపట్టారు. భూవిస్తీర్ణం, వ్యక్తిగత, ఉమ్మడి, సంస్థాగత సాగు వివరాలను స్పష్టంగా సేకరిస్తున్నారు. వివరాల సేకరణకు 75 మంది ఏఈవోలు, 15 మంది ఎంపీఎస్‌వోలు, 15 మంది మండల వ్యవసాయాధికారులకు మొత్తం 105 మందికి బాధ్యతలు అప్పగించారు. తహసీల్దార్లు పర్యవేక్షకులుగా ఉంటూ అవసరమైన సాంకేతిక సలహాలను అందిస్తున్నారు.

సాంకేతికత వినియోగం..

కమతాల గుర్తింపు, వివరాల నమోదులో అధికారులు సాంకేతికతను వినియోగించుకుంటున్నారు. స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌ల ద్వారా వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఇప్పటికే రైతుబంధు పథకం కోసం సేకరించిన రైతుల ఆధార్‌, భూ విస్తీర్ణం, పంటల సాగు వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం సేకరిస్తున్న వివరాలు కూడా పూర్తిగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండటంతో గణన కచ్చితత్వం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఆగస్టు 31 నాటికి వందశాతం

ఈ నెలాఖరులోగా వ్యవసాయ గణను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించాం. 2015– 16లో సేకరించిన వివరాల ప్రకారం జిల్లాలో రైతులు 1,08,208 మంది ఉన్నారు. ప్రస్తుతం పూర్తి వివరాలు అందుబాటులోకి వస్తే ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లాలో 31 శాతం వివరాల సేకరణ పూర్తయింది. ఆగస్టు 31 నాటికి వందశాతం గణనను పూర్తి చేస్తాం.

– రవీందర్‌, జిల్లా గణాంకశాఖ అధికారి

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్‌, అధికారులు

ఆసిఫాబాద్‌: స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని జాయింట్‌ సీఈవో సర్ఫరాజ్‌ అహ్మద్‌ అన్నారు. హైదరాబాద్‌ నుంచి బుధవారం కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ఓటరు జాబితా రూపకల్పన, 5కే రన్‌ కార్యక్రమంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు అధికారులు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 19న ‘ఐ ఓట్‌ ఫర్‌ ష్యూర్‌’ అనే నినాదంతో చేపట్టనున్న 5కే రన్‌ విజయవంతం చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే, అదనప కలెక్టర్‌ దాసరి వేణు, ఆర్డీవోలు సురేశ్‌, రాజేశ్వర్‌, నోడల్‌ అధికారి సురేందర్‌ హాజరయ్యారు. అనంతరం కలెక్టర్‌ మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన యువత, ట్రాన్స్‌జెండర్లు, దివ్యాంగులు ఓటు నమోదు చేసుకునేందుకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సోషల్‌ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నామని తెలిపారు. 5కే రన్‌ విజయవంతం చేసేందుకు అధికారులతో కార్యాచరణ రూపొందించామని పేర్కొన్నారు.

కుష్ఠు నివారణకు పటిష్ట చర్యలు



కరపత్రాలు విడుదల చేస్తున్న కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే, డీఎంహెచ్‌వో రామకృష్ణ

- కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లాలో కుష్ఠు వ్యాధి నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే అన్నారు. కుష్ఠు నివారణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో డీఎంహెచ్‌వో రామకృష్ణతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. కలెక్టర్‌ మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి సోకిన వారిని గుర్తించి 6 నుంచి 12 నెలలపాటు చికిత్స అందించాలన్నారు. సకాలంలో మందులు అందిస్తే వ్యాధి తగ్గుముఖం పట్టే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 16 నుంచి 31 వరకు ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. వ్యాధిగ్రస్తులను గుర్తించి అప్పటికప్పుడు రిఫాంపియన్‌ మందులు అందించాలన్నారు. వ్యాధి మూడో దశలో ఉన్న వారికి వెంటనే వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్‌, డీపీవో ధరమ్‌సింగ్‌, డీపీఎంవో రమేశ్‌, డీఎంవో రషీద్‌, హెచ్‌వో శ్యాంలాల్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

కాగజ్‌నగర్‌టౌన్‌: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్‌ కమిటీ సభ్యురాలు ఆర్‌.త్రివేణి అన్నారు. తెలంగాణ ఆశ వర్కర్స్‌ యూనియన్‌ జిల్లా అధ్యక్షురాలు స్వరూప అధ్యక్షతన బుధవారం కాగజ్‌నగర్‌ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆశ వర్కర్ల జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం రానున్న కాలంలో పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్నట్లు ఫిక్సిడ్‌ వేతనం అందజేయాలని డిమాండ్‌ చేశారు. పీఎఫ్‌, ఈఎస్‌ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమావేశంలో ఆశ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



దిష్టిబొమ్మలు దహనం చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: అంకుసాపూర్‌కు చెందిన సుధాకర్‌ హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్‌ జాతీయ నాయకుడు రేగుంట కేశవ్‌రావు డిమాండ్‌ చేశారు. సుధాకర్‌ కుటుంబానికి న్యాయం చేయాలని బుధవారం జిల్లా కేంద్రంలోని రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం దుండగుల దిష్టిబొమ్మలు దగ్ధం చేశారు. బాధిత కుటుంబానికి దళిత బంధు, డబుల్‌ బెడ్రూం ఇల్లు, రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా, మూడెకరాల భూమి అందించాలని కోరారు. బాలాజీ, మహేశ్‌, సత్యనారాయణ, కిరణ్‌, వెంకటేశ్‌, శ్రావణ్‌, శంకర్‌, బాలేష్‌, శేఖర్‌, యశోద, కళావతి, సుశీల, పద్మ, శారద, పుష్ప పాల్గొన్నారు.

సమ్మెబాట పట్టిన సెకండ్‌ ఏఎన్‌ఎంలు



శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: సర్వీసు రెగ్యులరైజ్‌ చేయాలనే డిమాండ్‌తో వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న సెకండ్‌ ఏఎన్‌ఎంలు సమ్మెబాట పట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం నుంచి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ ఎదుట ఆందోళనలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్‌ మాట్లాడుతూ సెకండ్‌ ఏఎన్‌ఎంలను ఎలాంటి షరతులు లేకుండా క్రమబద్ధీకరించాలన్నారు. చాలీచాలని వేతనాలతో వారు 20 ఏళ్లుగా శ్రమదోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సెకండ్‌ ఏఎన్‌ఎంలతోపాటు ఈసీ, అర్బన్‌, ఆర్‌బీఎస్‌కే, 104 సిబ్బందితోపాటు వివిధ రకాల ఏఎన్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించేవరకు పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దివాకర్‌, నాయకులు వసంత, సంతోషి, పుణ్యవతి, భూదేవి, ప్రమీల, లక్ష్మి, సరస్వతి, తిరుమల, లీల, రాధ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ‘సిర్పూర్‌’ వెనుకంజ

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌

పెంచికల్‌పేట్‌/దహెగాం: ఎమ్మెల్యే అసమర్థతతోనే సిర్పూర్‌ నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌ ఆరోపించారు. రెండో విడత బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా బుధవారం చేడ్వాయి నుంచి పెంచికల్‌పేట్‌ వరకు బైక్‌ ర్యాలీ నిర్వహించారు. పెంచికల్‌పేట్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం దహెగాం మండల కేంద్రంతోపాటు హత్తిని గ్రామాల్లో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనప్ప నియోజకవర్గ ప్రజల సొమ్ము దోచుకుని ఆంధ్రకు తరలిస్తున్నారని ఆరోపించారు. కాగజ్‌నగర్‌ మండలంలోని అందవెల్లి పెద్దవాగుపై వంతెన పనులు పూర్తిచేయడంలో విఫలమయ్యారన్నారు. 34 గ్రామాలకు మిషన్‌ భగీరథ తాగునీరు అందడం లేదని తెలిపారు. పెంచికల్‌పేట్‌– దహెగాం మధ్య పెద్దవాగు వంతెన అప్రోచ్‌రోడ్డు పూర్తి కాకపోవడంతోనే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెసరికుంట గ్రామం వరదలతో జలదిగ్బంధమవుతున్నా ఎమ్మెల్యే స్పందించడం లేదని మండిపడ్డారు. నియోజకవర్గంలోని ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర నాయకుడు సిడాం గణపతి, నాయకులు రాంప్రసాద్‌, ప్రవీణ్‌, దేవిదాస్‌, మహేందర్‌, తిరుపతి, గౌతం, శంకర్‌, బాబాజీ, ఆశన్న దేవాజీ పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్‌లో జెండా ఆవిష్కరిస్తున్న ఆర్‌ఎస్పీ

‘విద్యార్థులను ఇబ్బంది పెడితే ఉపేక్షించం’



పాఠశాలను పరిశీలిస్తున్న రమాదేవి

బెజ్జూర్‌(సిర్పూర్‌): విద్యార్థులను ఇబ్బంది పెడితే ఎంతటివారైనా ఉపేక్షించమని జిల్లా గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్‌ రమాదేవి అన్నారు. బెజ్జూర్‌, సలుగుపల్లి, కుంటలమానెపల్లి పాఠశాలలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బెజ్జూర్‌ ఆశ్రమ పాఠశాలలో వేధింపుల ఘటనలో హెచ్‌ఎంను సస్పెండ్‌ చేసినట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జిల్లాలోని ఎనిమిది ఆశ్రమ పాఠశాలల్లో పురుష ఉపాధ్యాయులు, హెచ్‌డబ్ల్యూలు ఉన్నచోట మహిళా ఉపాధ్యాయులను నియమించినట్లు తెలిపారు. బెజ్జూర్‌ ఆశ్రమ పాఠశాలలోనే ఐదుగురు సీఆర్టీలను మార్చినట్లు పేర్కొన్నారు. పీఈటీలను నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జీసీడీఓ శకుంతల, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు మారుబాయి ఉన్నారు.

క్లుప్తంగా

గుడుంబా స్థావరాలపై దాడులు

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని లింగాపూర్ శివారులో బుధవారం టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. వంద లీటర్ల బెల్లం పానకం పారబోశారు. గుడుంబా తయారీకి ఉపయోగించే సామగ్రిని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గుడుంబా తయారు చేసినా విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సైలు అశోక్, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

పంట ధ్వంసం చేసిన ఇద్దరిపై కేసు

చింతలమానెపల్లి: మండలంలోని చీపురుదుబ్బ శివారులో పంటను ధ్వంసం చేసిన ఎల్ములె నాందేవ్, టాకిరె రమేశ్‌లపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. మండలంలోని బాబాసాగర్ గ్రామానికి చెందిన పిప్రె శ్రీనివాస్‌కు చీపురు దుబ్బ శివారులో వరి సాగు చేస్తున్నాడు. ఈ నెల 14న ఎల్ములె నాందేవ్, టాకిరె రమేశ్ అక్రమంగా పిప్రె రమేష్ భూమిలోకి వచ్చి పంటను, భూమి హద్దులను ధ్వంసం చేశారు. బాధిత రైతు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

విద్యుత్ తీగలు అమర్చిన ఒకరి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

వాంకిడి: పంట చేనుకు రక్షణగా విద్యుత్ తీగలు అమర్చిన కెరమెరి మండలంలోని పాటగూడకు చెందిన ఆత్రం రామును బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ ఈ నెల 12న రాము పంట చేనుకు రక్షణగా అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి కాకడ్‌బోడ్డి గ్రామానికి చెందిన సిడాం మారు (23) మృతి చెందినట్లు తెలిపారు. ఈమేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో కెరమెరి ఎస్సై గుంపుల విజయ్ ఉన్నారు.

ఇద్దరికి రెండేళ్ల జైలు

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండలంలోని ఎల్లారంకు చెందిన శేఖర్, మొగిలికి స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పుచెప్పినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. 2017లో గ్రామానికి చెందిన పింగిళి రమేశ్‌తో గొడవ పెట్టుకోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపిన పోలీసులు నేరం రుజువు కావడంతో బుధవారం కోర్టు శిక్ష విధించినట్లు తెలిపారు.

శ్రావణం.. శుభప్రదం



శ్రావణ మాసంలో ప్రత్యేక పూజలు చేయనున్న చెన్నూర్ శివాలయం

- నేటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం
- శివుడికి అత్యంత ప్రీతికరం
- అన్నీ ప్రత్యేకమైన రోజులే..
- ఆలయాల్లో మంగళగౌరీ, వరలక్ష్మీ వ్రతాలు

చెన్నూర్: హిందూ సంప్రదాయం ప్రకారం శ్రావణమాసం అత్యంత పవిత్రమైనది. ఈ మాసంలో శివుడి ఆరాధాన మేలు చేస్తుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈ మాసంలో శివుడు, మహావిష్ణువు, లక్ష్మీ దేవిని భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. ఈ నెలలో చేసే పూజలు, వ్రతాలు శుభ ఫలితాలను ఇస్తాయని భక్తుల నమ్మకం. ఇదే మాసంలో వరలక్ష్మీ, మంగళ గౌరీ వ్రతాలు, నాగపంచామి, రాఖీ పౌర్ణమి, పొలాల అమావాస్య లాంటి ముఖ్యమైన పండుగలు వస్తాయి. ఈ ఏడాది జూలై 18 నుంచి ఆగస్టు 16 వరకు అధిక శ్రావణ మాసం బుధవారంతో ముగిసింది. ఈ నెల 17 గురువారం నుంచి నిజ శ్రావణ మాసం ప్రారంభంకాగా సెప్టెంబర్ 15 శుక్రవారంతో ముగియనుంది.

వ్రతాలకు ప్రత్యేకమైన మాసం

మహిళలు పాటించే వ్రతాలు అధికంగా ఈ మాసంలోనే ఉన్నాయి. ఈ మాసాన్ని వ్రతాల మాసమని, సౌభాగ్యాన్ని ప్రసాదించే మాసమని కూడా అంటారు. ఈ మాసంలో ప్రతీ ఇళ్ల ఆలయాన్ని తలపిస్తుంది. ఎంతో పవిత్రమైన శ్రావణమాసం గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మాసంలో నెలరోజులపాటు శివాలయాలు ఉదయం, సాయంత్రం భగవన్నామస్మరణతో మారుమ్రోగుతాయి. శ్రావణంలో చేపట్టే ఎలాంటి కార్యానికైనా ఎంతో పవిత్రత ఉంటుందని పండితులు పేర్కొంటున్నారు.

హిందూ పంచాంగం ప్రకారం..

హిందూ పంచాంగంలో ప్రతీ మాసానికి ఒక ప్రత్యేకత ఉంది. వాటిలో శ్రావణమాసం ఒకటి. చాంద్రమానం ప్రకారం ఐదవ మాసం. ఈ మాసంలో పౌర్ణమి రోజున చంద్రుడు శ్రవణ నక్షత్రానికి సమీపంలో ఉంటాడు. కనుక ఈ మాసానికి శ్రావణ మాసం అని పేరు వచ్చింది. మహావిష్ణువు జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రం. అటువంటి శ్రవణా నక్షత్రం పేరుతో ఏర్పడిన శ్రావణ మాసం శ్రీమహావిష్ణువు పూజకు ప్రత్యేకత సంతరించుకున్న మాసం. శ్రావణ మాసంలో మంగళ, శుక్ర, శనివారాలు అంత్యంత ప్రధానమైనవిగా పరిగణిస్తారు. మంగళవారం శ్రీగౌరీ పూజకు, శుక్రవారం లక్ష్మీ పూజకు, శనివారం శ్రీ మహావిష్ణువు పూజకు ముఖ్యమైన రోజులుగా వేదపండితులు పేర్కొంటున్నారు.

ఈ ప్రాంతానికి ప్రత్యేకత



చెన్నూర్‌లో గల గోదావరి నదికి కాశీ అంతటి ప్రాముఖ్యత ఉంది. కాశీలోని గోదావరినది ఉత్తర దిశగా రెండు కోశుల దూరం ప్రవహిస్తుండగా చెన్నూర్ గోదావరినది ఉత్తర దిశగా ఐదు కోశుల దూరం ప్రవహిస్తుంది. అందుకే చెన్నూర్ గోదావరినదికి పంచకోశ ఉత్తర వాహిని అని పేరుంది. అలాగే ఆగస్త్యా మహాముని ప్రతిష్టించిన శివలింగం చెన్నూర్‌లో ఉంది. అందుకే ఈ మాసంలో గోదావరినదిలో స్నానం అచరించి శివాలయంలో పూజలు చేస్తే శుభం కలుగుతుందని అనాదిగా వస్తున్న ఆచారం.– వేమారం మహేశ్వరశర్మ, శివాలయ అర్చకులు, చెన్నూర్

ఆర్‌కే 5గనిని సందర్శించిన అధికారులు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే 5 గనిని బుధవారం కోలిండియా అధికారుల బృందం సందర్శించింది. సీనియర్ మేనేజర్ అంజనీకుమార్, డెప్యూటీ మేనేజర్ నందకిషోర్‌యాదవ్, సర్వేయర్ నసీంపర్వేజ్, జేబీసీసీఐ మెంబర్ లఖన్ లాల్‌మహతోలతో కూడిన బృందం గనిలోకి దిగి పని ప్రదేశాలను పరిశీలించింది. ఎత్తు తక్కువ ఉన్న సీములలో బొగ్గు ఉత్పత్తికి సంస్థ అనుసరిస్తున్న విధానాలను ఆర్‌కే 5 అండ్ 6 గ్రూప్ ఏజెంట్ ఏవి రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో జీఎం సంజీవరెడ్డితో సమావేశం అయ్యారు. ఈ కార్యక్రమంలో గని ఇన్‌చార్జి మేనేజర్ శివయ్య, పిట్ ఇంజనీర్ రాధాకృష్ణ, సర్వేయర్ లక్ష్మణ్, కిరణ్, ఇందారం ఓసీ పీవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



గని వద్ద కోలిండియా అధికారుల బృందం

ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందిపై విచారణ

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండల కేంద్రంలోనిప్రభుత్వ ఆస్పత్రిలో ఈ నెల 13న అవుట్ సోర్సింగ్ సిబ్బంది రోగుల వద్ద డబ్బులు అడుగుతున్నారని సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సూపరింటెండెంట్ శ్రీనివాస్ సిబ్బందిని తొలగించారు. బుధవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సివిల్ సర్జన్ అధికారి కోటేశ్వర్ దీనిపై విచారణ చేపట్టారు. నివేదికను జిల్లా వైద్యాధికారి అరవింద్‌కు అందజేస్తామని, త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.



విచారణ చేపడుతున్న కోటేశ్వర్

అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎస్‌జీటీస్ కాలనీలో నివాసం ఉంటున్న పడోరె తుకారాం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం తాపీమేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న తుకారాం మూడు రోజులుగా కనిపించడంలేదు. బుధవారం ఇంటి సమీపంలో దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి ఇంట్లోకి వెళ్లిచూడగా మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉంది. మృతదేహానికి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడు ఆత్మహత్య



పర్వతాలు (ఫైల్)

భీమిని(బెల్లంపల్లి): మండలంలోని చిన్నగుడిపేట గ్రామానికి చెందిన రాస పర్వతాలు (76) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం పర్వతాలు కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో మంగళవారం రాత్రి మద్యం మత్తులో గుర్తు తెలియని పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా బుధవారం మృతి చెందాడు. మృతుని భార్య మల్లక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంటి నంబర్ల మాయాజాలం

- పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన

తాండూర్: మండలంలోని మాదారం త్రీ ఇంక్లైన్ గ్రామ పంచాయతీ ఇళ్ల నంబర్ల మాయాజాలానికి కేంద్రంగా మారింది. ఓపెన్‌కాస్టు ముంపు పరిహారం కోసం దూరదృష్టితో కొందరు ఇళ్ల నిర్మాణం చేపట్టగా అనుమతులు, నంబర్ల కేటాయింపు, తారుమారు కావడం వివాదాస్పదంగా మారుతోంది. వచ్చే ఏడాది ఈ ప్రాంతంలో మహావీర్‌ఖని ఓపెన్ కాస్టు ప్రాజెక్టు ఏర్పాటవుతుందనే ప్రచారంతో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ నుంచి విడిపోయిన మాదారం 3ఇంక్లైన్ కొత్త పంచాయతీగా ఏర్పడింది. దశాబ్దాల కాలంగా గ్రామంలో నివసిస్తున్న కొందరి ఇళ్ల నంబర్లు ఆన్‌లైన్‌లో గల్లంతయ్యాయి. మరికొందరి ఇళ్ల నంబర్లు ఇతరుల పేరిట మార్పు జరిగాయి. ఈ విషయం బహిర్గతం కావడంతో గ్రామస్తులు బుధవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి సాధుల్లా, సర్పంచ్ గాజుల సుజాత భర్త శ్రీనివాస్‌ను నిలదీశారు. ఇష్టారీతిన ఆన్‌లైన్‌లో ఇళ్ల నంబర్లు మార్చడం, కొత్తగా నిర్మించుకున్న వారికి పాత వారి ఇంటి నంబర్లు కేటాయించడం, పాత వారికి కొత్త నంబర్లు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓసీపీ ముంపు జాబితాలో పాత ఇళ్ల జాబితాను పరిగణనలోకి తీసుకుంటే తమ పరిస్థితి ఏమిటని నిలదీశారు.

పెరిగిన ఇళ్ల సంఖ్య

పంచాయతీ ఏర్పడిన సమయంలో 240 ఇళ్లకు నంబర్లు కేటాయించి ఉండగా.. తాజాగా ఆసంఖ్య 412కు చేరింది. ముంపు పరిహారం కోసం ఇష్టారాజ్యంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతుండగా పంచాయతీ అధికారులు నంబర్లు కేటాయిస్తున్నారనే విమర్శలున్నాయి. గతంలోనూ ఇళ్ల నంబర్ల కేటాయింపు వివాదం తలెత్తడంతో అప్పటి పంచాయతీ కార్యదర్శి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. సదరు కార్యదర్శిపై చర్యలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఆ వివాదం సద్దుమణగక ముందే మళ్లీ మరో వివాదం తెరపైకి వచ్చింది. జాబితాను సరి చేసి గ్రామస్తులకు అన్యాయం జరగకుండా చూడాలని మాజీ ఎంపీటీసీ రెబ్బెన రాంచందర్ కోరారు. ఈ విషయమై ఎంపీవో సత్యనారాయణ స్పందిస్తూ తాజాగా మళ్లీ ఇంటి నంబర్లు మార్చినట్లు తెలిసిందని, విచారణ జరిపి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, ఎవరికీ నష్టం కలుగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.



పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

- తన ఇంటి నంబరును మార్చడంపై అధికారులను ప్రశ్నిస్తే అది సమస్య కాదని అంటున్నారని, మిగతా ఆధారాలు ఎలా మార్చుకోవాలని గ్రామస్తుడు జే.వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.
- గ్రామంలోని బోర్లకుంట పార్వతికి గూనపెంకుల ఇళ్లు 167 అసెస్‌మెంటుతో ఉండగా ఇంటి నంబరు 10–49 కేటాయించారు. మూడు దశాబ్దాలుగా ఇంటి పన్ను చెల్లిస్తోంది. ప్రస్తుతం ఆ అసెస్‌మెంటు నంబరు మేరుగు మల్లేశ్వరికి కేటాయించారు. పార్వతి పేరుపై 2021 నుంచి ఇల్లు ఉన్నట్లు, ఒకసారి మాత్రమే పన్ను కట్టినట్లు ఆన్‌లైన్ రికార్డుల్లో చూపించడంతో లబోదిబోమంటూ న్యాయం చేయాలని వేడుకుంటోంది.

అక్రమ కట్టడాలు కూల్చివేత

సాక్షి ఎఫెక్ట్..

నస్పూర్: ఈనెల 15న 'యథేచ్ఛగా ప్రభుత్వ భూమి కబ్జా' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ కట్టడాన్ని బుధవారం బ్లేడు ట్రాక్టర్‌తో కూల్చివేయించారు. నస్పూర్ శివారు సర్వే నంబర్ 64లోని సుమారు 19 గుంటల ప్రభుత్వ భూమిలో కొందరు వ్యక్తులు అనుమతులు లేకుండా రెడీమేడ్ ప్రహరీ ఏర్పాటు చేశారు. విచారణ జరిపిన అధికారులు సదరు కట్టడాన్ని కూల్చివేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఇర్ఫాన్‌ఖాన్ పఠాన్ మాట్లాడుతూ కలెక్టర్ బదావత్ సంతోష్, మంచిర్యాల ఆర్డీవో రాములు ఆదేశాల మేరకు కట్టడాన్ని కూల్చి వేయించామన్నారు. ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు నిర్మిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కూల్చివేయిస్తున్న అధికారులు

బీఎస్పీ నాయకుడిపై దాడి సరికాదు

తాండూర్: బీఎస్పీ నాయకుడిపై బీఆర్‌ఎస్ యూత్ శ్రేణుల దాడి సరికాదని, దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కాసిపేట గ్రామానికి వెళ్లి గాయపడిన వరప్రసాద్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఏమాజీ మాట్లాడుతూ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడి వెనుక ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హస్తం ఉందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తిరుపతి, కేశవరెడ్డి, గోవర్ధన్, రాజులాల్ యాదవ్, నవీన్, నర్సింగ్, శ్రావణ్‌కుమార్, రాజేశ్ పాల్గొన్నారు.



బాధితుడిని పరామర్శిస్తున్న కొయ్యల ఏమాజీ

బాధితులకు పరామర్శ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పెద్దంపేటకు చెందిన జంగం లక్ష్మి, నీరటి రామమ్మలను బుధవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ బృందం సభ్యులు కలిసి వివరాలు సేకరించారు. ఈ నెల 6న ఓ భూమి విషయంలో గొల్లపల్లి గ్రామానికి చెందిన గొర్రె గురువయ్య, లక్ష్మి ఇరువురు కలిసి రామమ్మ, లక్ష్మిలను రాజీకి పిలిపించి కులం పేరుతో దూషిస్తూ ఇనుప పైపులతో దాడి చేశారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకుని తగు న్యాయం జరిగే విధంగా చూస్తామని కమిటీ సభ్యులు హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో సభ్యులు జిల్లపల్లి వెంకటేశం, బచ్చల అంజన్న, రేగుంట లింగయ్య ఉన్నారు.



పాముకాటుతో యువకుడి మృతి



రాజు (ఫైల్)

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ గ్రామానికి చెందిన ధనూరి రాజు(24)పాముకాటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి రాజు ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు...



రాందాస్ (ఫైల్)

సిర్పూర్(టి): ఈ నెల 11న పాముకాటుకు గురైన సిర్పూర్(టి) మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బగూడెంకు చెందిన ఎల్ములే రాందాస్(34) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రాందాస్ ఈనెల 11న గ్రామ సమీపంలోని పంట చేనుకు నీళ్లు పెట్టేందుకు కూలి పనులకు వెళ్లగా పాము కాటువేసింది. పక్కనే ఉన్న భోయిరే సాయినాథ్‌కు తెలపడంతో సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించి ఇంటికి తీసుకువచ్చారు. మంగళవారం పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అన్నను చూసేందుకు వెళ్లి అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



షకీల్(ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: అన్నను చూసేందుకు వెళ్లి తమ్ముడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని హడ్కోకాలనీకి చెందిన షకీల్ (20) కాగజ్‌నగర్‌లో ఉన్న తన సోదరుడి ఆరోగ్యం బాగాలేకపోవడంతో చూసేందుకు బుధవారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. వంకులం సమీపంలోకి వెళ్లగానే ఎదురుగా వచ్చిన ఐచర్ వ్యాన్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదం జరిగిన అరగంటసేపు ఎవరూ పట్టించుకోకపోవడంతో చికిత్సకు ఆలస్యం జరిగిందని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతదేహానికి ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఐచర్ వ్యాన్ డ్రైవర్‌పై రెబ్బెన పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

బెదిరింపుల కేసులో జరిమానా

జైపూర్(చెన్నూర్): చంపుతామని బెదిరింపులకు పాల్పడిన ముగ్గురికి రూ.12 వేల జరిమానా విధిస్తూ జడ్జి సంపత్ బుధవారం తీర్పు వెలువరించినట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. మండలంలోని కుందారం గ్రామానికి చెందిన దండె అమృతమ్మ, రాజయ్య దంపతులు 2018, ఆగస్టు 1న తమ పంటచేనులో గడ్డి తీస్తుండగా కోడలు దండె వర్షిత, ఆమె తండ్రి కామ వెంకటి, తల్లి చంద్రమ్మ అక్కడి వెళ్లి భూమి పంచి ఇవ్వమని గొడవకు దిగారు. రాజయ్యను కర్రతో కొట్టి చంపుతామని బెదిరించడంతో అమృతమ్మ ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చెన్నూర్ కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రేమలత ద్వారా సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో నిందితులకు రూ.12వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

ఈసారికి 'ఇంజినీరింగ్' లేనట్టే!

- జేఎన్టీయూ కాలేజీ ఇస్తామని నిర్మల్ సభలో సీఎం కేసీఆర్ హామీ
- పాలేరు, మహబూబాబాద్‌లలో 300 సీట్ల చొప్పున ప్రారంభం
- ఉమ్మడి జిల్లాకు ఉత్త చెయ్యేనా?

నిర్మల్: గత జూన్ 4న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు ఆవశ్యకతపై 'సాక్షి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. అదేరోజు నిర్మల్ సమీకృత కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి వచ్చిన సీఎం కేసీఆర్‌ను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి జిల్లాకు ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సీఎం ఉమ్మడి జిల్లాకు జేఎన్టీయూ కళాశాలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అది ఎక్కడ ఉండాలో మంత్రి నిర్ణయిస్తారని చెప్పారు. ఈ విద్యాసంవత్సరమే తరగతులు ప్రారంభమవుతాయని అప్పట్లో అధికారపార్టీవర్గాలూ పేర్కొన్నాయి. కానీ.. ఇంతవరకు ఆ ఊసే లేకపోవడం నిరాశ కలిగిస్తోంది.



కొత్తగా రెండు ప్రారంభం..

జేఎన్‌టీయూహెచ్ ఆధ్వర్యంలో తాజాగా రెండు కొత్త కళాశాలలు ప్రారంభమయ్యాయి. ఖమ్మం జిల్లా పాలేరు, మహబూబాబాద్‌లో ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించనున్నారు. ఒక్కోచోట సీఎస్‌ఈ, సీఎస్‌ఈ (డేటాసైన్స్), ఈసీఈ, ఈఈఈ, మెకానికల్ ఈ ఐదు బ్రాంచీలు మంజూరయ్యాయి. ఒక్కో బ్రాంచీకి 60సీట్ల చొప్పున కాలేజీకి మొత్తం 300సీట్లు కేటాయించారు. ప్రత్యేక విడత కౌన్సెలింగ్ గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈ విడత ద్వారా కొత్త కాలేజీల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఇక రెండేళ్ల క్రితమే వనపర్తి, సిరిసిల్లలో జేఎన్టీయూ కాలేజీలు ప్రారంభించారు. ఇప్పటికే జగిత్యాల, మంథని, సుల్తాన్‌పూర్‌లో జేఎన్టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాలలు నిర్వహిస్తోంది.

ఇక్కడ అవసరం..

ఇంటర్ పూర్తి కాగానే ఉమ్మడి జిల్లాకు చెందిన చాలామంది విద్యార్థులు ఇంజినీరింగ్ వైపు వెళ్తున్నారు. హైదరాబాద్‌లాంటి దూరప్రాంతాలకు వెళ్లి చదవాల్సి వస్తోంది. ఆర్థికంగా తల్లిదండ్రులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. స్థానికంగా డిగ్రీలో కూడా ఉపాధినిచ్చే ప్రత్యేక కోర్సులు లేకపోవడం, పీజీ కాలేజీ కూడా అందుబాటులోకి రాక తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇక సాఫ్ట్‌వేర్ సంస్థలే జిల్లాల బాట పడుతున్న ప్రస్తుత తరుణంలో స్థానికంగా ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్న వాదన వస్తోంది. సీఎం కేసీఆర్ జిల్లాకు మంజూరు చేస్తున్నట్లు ఇచ్చిన హామీ మేరకు త్వరలో కళాశాల ప్రారంభమయ్యేలా చూడాలన్న డిమాండ్ పెరుగుతోంది.

విశ్వరూప మహాసభ విజయవంతం చేయండి

- ఎమ్మెస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్ మాదిగ

మందమర్రిరూరల్(చెన్నూర్): ఆగస్టు చివరి వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎమ్మెస్‌ఎఫ్) జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను కలిసి మాట్లాడారు. ఆయన వెంట మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా కన్వీనర్ చెన్నూరి శ్రీనివాస్, పట్టణ ఇన్‌చార్జి జీడి సారంగం, నాయకులు పెరిక నర్సయ్య, సుగుణాకర్, విష్ణు, కిరణ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సోమశేఖర్ మాదిగ

నీటికుంటలో పడి యువకుడి మృతి

తలమడుగు: ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు ప్రకారం.. మండలంలోని అర్లి(కే) గ్రామానికి చెందిన మాధవి శేఖర్(22) గ్రామ సమీపంలోని నీటి కుంటలో పడి మృతిచెందాడు. శేఖర్ కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. బుధవారం ఉదయం ఇంటి నుంచి కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామ సమీపంలోని నీటికుంట వద్దకు వెళ్లాడు. నీటి కుంట వద్ద ఫిట్స్ రావడంతో నీటిలో పడి మృతిచెందాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

GRANITE MACHINES FOR SALE

a) SOCOMEC Italian 72 Multi Wire Variable Thickness Sparingly Used Cutting Machine, In Perfect Running Condition with All Accessories.

b) BARSANTI Italian 16 Head, Brand New Unused Fully Automatic Polishing Line, Perfect Trial Condition with All Accessories.

7397741830 BANGALORE

WANTED

■ లేపాక్షి హెల్త్ కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 18K, ఏజెంట్ కమీషన్5K ఫోన్: 9640400073 [HA-189320]

■ మ్యారేజ్ బ్యూరో నందు పనిచేయుటకు అమ్మాయి కావలెను. చదువుతో నిమిత్తం లేకుండా మంచి వాక్చాతుర్యం గల నమ్మకంతో పనిచేసే అమ్మాయి కావలెను. 8341220970 [K-1185575]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,